https://teluguislam.net



# ప్రప్రథమంగా ఇస్లాం స్వీకరించిన వారి సహన సంయమనాలను పురికొల్పిన కారణాలు

లోతైన ఆలోచన, దృఢమైన బుద్ధి వివేచనలు గల వ్యక్తి ఎవరైనా, ప్రప్రథమంగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన ఈ ముస్లిములు సహనాన్ని, సంయమనాన్ని, ధైర్యసాహసాలను ఎలా ప్రదర్శించగలిగారు? ఏ కారణాలు వారిని స్థిరంగా ఉంచడానికి దోహదపడ్డాయి? అనే విషయాన్ని ఆలోచించి నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు లోనుకాకమానడు. విన్నంతనే రోమాలు నిక్కబొడుచు కునేటటువంటి హింసాదౌర్జన్యాలను ఎలా సహించగలిగారు? అనే ఆలోచనలో పడిపోవడం సహజం. మాటిమాటికి ఉత్పన్నమయ్యే ఈ ప్రశ్నల నేపథ్యంలో ఆ కారణాలను, ఆ పరిస్థితులను గురించి టూకీగా చెప్పడం ఇక్కడ సమంజసంగా తోస్తుంది.

## 1. అల్లాహ్ ఎడల విశ్వాసం

వీటన్నిటిలో మొట్టమొదటి ముఖ్య కారణం, వారిలో ఏకేశ్వరు డయిన అల్లాహ్ ఎడల విశ్వాసం దృఢంగా నాటుకొనిపోవడం మరియు వారిలో దైవానికి సంబంధించిన పూర్తి అవగాహన కలగడం. ఎందుకంటే, మనిషి హృదయంలో దేవునిపై విశ్వాసం దృఢంగా నాటుకుపోతే అతను పర్వతా న్నయినా ఢీకొనడానికి సిద్ధపడతాడు. అందులో అతనే నెగ్గిరాగలడు. ఎవరయితే ఈ దృఢమైన విశ్వాసాన్ని, తిరుగులేని నమ్మకాన్ని పొందగలడో అతను ప్రాపంచిక వ్యధలను - అవి ఎంత అధికమైనవి అయినా, ఎంత కఠిన మైనవి అయినా, మరెంత ప్రమాదకరమైనవి అయినా - విశ్వాసం ముందు అల్పమైనవిగా తలుస్తాడు. అందుకని ఓ మోమిన్ (విశ్వాసి) తన విశ్వాస మాధుర్యం కంటే, నమ్మకపు బలం కంటే ఆ కష్టాలకు విలువే ఇవ్వడు.

فَأَمَّا الزَّبَدُ فَيَذْهَبُ جُفَاءً ۖ وَأَمَّا مَا يَنفَعُ النَّاسَ فَيَمْكُثُ فِي الْأَرْضِ ۚ

https://teluguislam.net



"నురుగంతా ఎగిరిపోతుంది. మానవులకు లాభం కలిగించే వస్తువు భూమిలో ఉండిపోతుంది." (13 : 17)

ఈ కారణం చేతనే సహనానికీ, స్థయిర్యానికీ ఊతమిచ్చే పరిస్థితులు ఏర్పడతాయి.

## 2. మనస్సును అలరింపజేసే నాయకత్వం

దైవప్రవక్త (స) ఇస్లామీయ సమాజాన్నే కాకుండా మానవాళి అంతటినీ నడిపించే మహోన్నత నాయకత్వపు లక్షణాలుగల నాయకుడు అన్న విషయం మనకు తెలిసిందే. ఆయన, మనస్సును ఇట్టే ఆకర్షించగల శారీరక అందచందాలు, మనోనైర్మల్యం, కారుణ్యాదాయకమైన నైతికత, మహోన్నత మైన నడవడిక మరియు గౌరవవంత మైన అలవాట్లు గల మహామనీషి. ఆయన్ను చూడగానే మనస్సు ఆయన వైపునకు అనుకోకుండానే మొగ్గిపోయేది. ప్రజలు మరే వ్యక్తి వైపు మొగ్గుజూప లేనంత సుగుణాల రాశి ఆయన. దైవప్రవక్త (స) గౌరవంలోను, నీతీ నిజాయితీలలోను అందరికంటే మిన్నగా ఉండేవారు. సౌశీల్యం, విశ్వస నీయత, సత్యసంధత లాంటి విషయాలన్నిటి లోను ఆయన (స)కు ఓ ప్రత్యేక స్థానం ఉండింది. ఈ కారణంచేత, మిత్రులకే కాకుండా శత్రువులకు సయితం ఆయన (స) గారి వ్యక్తిత్వంపై ఇసుమంత అనుమానం కూడా కలుగలేదు. ఆయన (స) నోట వెలువడ్డ ఏ మాట అయినా, అది సత్యమే అన్నది. ఆయన శత్రువులు కూడా ధృవపరిచే వారు,అది అయి తీరుతుంది అని నమ్మేవారు. సంఘటనలు దీన్ని ధృవపరుస్తు న్నాయి కూడా.

ఓ మారు ఖురైష్ తెగకు చెందిన ముగ్గురు వ్యక్తులు పరస్పరం ఒకరికి తెలియకుండా మరొకరు దాగి దివ్యఖుర్‌ఆన్ పారాయణాన్ని విన్నారు. ఆ తరు వాత ఆ రహస్యం కాస్తా బయటపడిపోయింది. ఆ ముగ్గురిలో అబూ జహల్ ఒకడు. ముగ్గురు కలసినప్పుడు ఒకడు అబూ జహల్, రాత్రి నీవు ముహమ్మద్ (స) నోట విన్న ఆ పలుకులను గురించి నీ అభిప్రాయం ఏమిటీ? అని అడిగాడు. అబూ జహల్ జవాబుగా, "నేనేం విన్నాను? విను! అసలు విషయం ఏమిటి అంటే, మనమూ, అబ్దె మునాఫ్ ఉభయ తెగలకు చెందినవారం గౌరవంలో ఒకరికి ఒకరం పోటీపడిన విషయం నీవెరిగినదే. వారు (నిరుపేద లకు) అన్నం పెడితే మనమూ పెట్టాము. వారు కానుకలుగా, బహుమతు లుగా వస్తువాహనాలను పంచిపెడితే మనమూ పంచిపెట్టాము. వారు ప్రజ

https://teluguislam.net



లకు దానమిస్తే మనమూ ఇచ్చినవాళ్ళమే. అలా వారు, మనం ఆ విషయంలో సమానమైపోయినవాళ్ళమే. వారి పరిస్థితి, మన పరిస్థితి రేసుగుర్రాల్లాగుండేది. ఇప్పుడేమో అబ్దె మునాఫ్ వారి తెగలో ఓ ప్రవక్త వచ్చాడని, ఆయన వద్దకు ఆకాశం నుండి వహీ (దివ్యావిష్కృతి) వస్తోందని అంటున్నారు. అయితే ఈ విషయంలో వారిని అందుకునేదెలా? దైవసాక్షి! మనం ఆ వ్యక్తి దైవదౌత్యాన్ని ఎన్నటికీ విశ్వసించేదిలేదు. మనం దాన్ని అసలు ధృవపరిచేదేలేదు."[1] అని అన్నాడు.

అదే దృష్టిలో పెట్టుకొని అబూ జహల్ తరచూ, "ఓ ముహమ్మద్ (స), నిన్ను మేము అసత్యవాది అని ఎప్పుడూ అనలేదు, అనం కూడా. అయితే నీవు తెచ్చిన దాన్ని మాత్రమే తిరస్కరిస్తున్నాం" అని అంటూ ఉండేవాడు. ఈ విషయం గురించే అల్లాహ్ దివ్యగ్రంథంలో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

فَإِنَّهُمْ لَا يُكَذِّبُونَكَ وَلَٰكِنَّ الظَّالِمِينَ بِآيَاتِ اللَّهِ يَجْحَدُونَ ﴿٣٣﴾

"వీరు నిన్ను నిరాకరించడం లేదు. ఈ దుష్టులు అల్లాహ్ ఆయత్‌లను (సూచనలను) తిరస్కరిస్తున్నారు." [2]

మరో సంఘటన ఇదివరకే చెప్పుకున్నాం. దాని ప్రకారం, ఓ రోజు దైవ తిరస్కారులు మహాప్రవక్త (స)ను మూడుమార్లు తూలనాడగా ఆయన (స) మూడో మారు నిలబడి, "ఓ ఖురైష్ వర్గమా! నేను మీ వద్దకు బలి తీసుకొని వచ్చాన"ని చెప్పారు. ఆ మాటలు వినగానే శత్రుత్వం వహించడంలో ఎవరు ముందడుగులో ఉన్నారో వారు నిలబడి, ఏ ఉత్తమ పదాన్నుపయోగించి ప్రాధేయపడాలో దాన్ని ఉపయోగించి ప్రాధేయపడసాగారు. అలాంటి మరో సంఘటనా వివరాలు కూడా మనం ఎరిగినవే. అవేమిటంటే, మహాప్రవక్త ముహమ్మద్ (స) సజ్దాలో పడిపోయినప్పుడు ఆయనపై ఒంటె పొట్టపేగులు పడవేయడం జరిగింది. ఆయన (స) సజ్దా నుండి తలపైకెత్తి అలా చేసిన వారిని శపించగా వారి వికటాట్టహాసాలు ఒక్కసారే మటుమాయమైపోయాయి. వారి ముఖాలపై భయం తాండవించింది. ఇక ఆ శాపం నుండి తప్పించుకోలేమనే నమ్మకం వారి వాలకం ద్వారా వ్యక్తమైంది.

---

1. ఇబ్నె హష్షామ్-1/316. 2. తిర్మిజీ, తఫ్సీర్, అన్ ఆమ్ సూరా-2/132.

https://teluguislam.net



అదే కాదు, మరో సంఘటన కూడా మనకు గుర్తుంది. దైవప్రవక్త (స) అబూ లహబ్ కుమారుడు ఉతైబాను శపించారు. ఆ శాపం వల్ల అతనికి ఇక తాను బ్రతికిబట్టకట్టలేనననే నమ్మకం ఏర్పడింది. అతను సిరియా దేశానికి వెళ్ళినప్పుడు పెద్ద పులిని చూడగానే, "దైవసాక్షి! ముహమ్మద్ (స) మక్కాలో ఉంటూనే నన్ను చంపేస్తున్నాడు" అని అరిచాడు.

'ఉబై బిన్ అబీ ఖల్ఫ్'కు సంభవించిన సంఘటన ఒకటుంది. అతను మాటిమాటికి మహాప్రవక్త (స)ను బెదిరించేవాడు. ఓమారు ఆయన (స) అతనితో, "(నీవు కాదు) దైవం తలిస్తే నేనే నిన్ను చంపేస్తాను" అని అన్నారు. ఆ తరువాత ఉహద్ యుద్ధం జరిగిన రోజు, ఆయన (స) ఉబై మెడపై బరిశెతో పొడిచారు. అది ఏమంత పెద్ద గాయం కాదు. కేవలం బరిశె మొన గుచ్చుకొని మెడపై గీటు మాత్రమే పడింది. అయితే ఉబై మాత్రం, "ముహమ్మద్ (స) నాతో మక్కాలో, 'నిన్ను నేను సంహరించగలను' అని అన్నాడనే పలుకులు వల్లిస్తూ, ఆయన నాపై ఉమ్మి వేసి ఉండినా నా ప్రాణం ఎగిరిపోయేది" అని అనసాగాడు.[3]

ఇలాగే ఓసారి సఅద్ బిన్ ముఆజ్ అనే వ్యక్తి మక్కాలో ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌తో, "దైవప్రవక్త (స), ముస్లిములు నిన్ను హతమారుస్తారని అనగా విన్నాన"ని అన్నాడు. దానికి ఉమయ్యాను భయం అలుముకుంది. ఆ భయం వీడనందున అతడు మక్కా వదలి బయటకు వెళ్ళనని తీర్మానించుకున్నాడు. బద్ర్ యుద్ధం జరిగినప్పుడు అబూ జహల్ బలవంతపెట్టగా అతను మక్కాను వదలి వెళ్ళాల్సివచ్చింది. దాని కోసం అతను ప్రమాదాన్ని శంకించగానే పారిపోయి రావడానికిగాను వేగంగా పరిగెత్తే ఓ ఒంటెను కొన్నాడు. యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న ఉబైను చూసి అతని భార్య వారిస్తూ, "అబూ సఫ్వాన్, నీ యస్రబీ సోదరుడు చెప్పింది మరచిపోయావా?" అని అడిగింది. దానికి జవాబిస్తూ అబూ సఫ్వాన్ (ఉమయ్యా బిన్ ఖల్ఫ్), "లేదు! దైవసాక్షి, నేను కొంతదూరం వరకే వెళ్ళి తిరిగి వచ్చేస్తానుగా" అని అన్నాడు.[4]

ఇదీ ఆయన (స) గారి శత్రువుల పరిస్థితి. ఇకపోతే మహాప్రవక్త (స) మిత్రులు మరియు ఆయన అనుచరుల విషయానికొస్తే ఆయన వారి పాలిటి

---

3. ఇబ్నె హష్షామ్-2/84. (వివరాలు ముందు పేజీలలో రాబోతున్నాయి)
4. సహీ బుఖారి-2/563.

https://teluguislam.net



పంచప్రాణాలు అనే చెప్పాలి. ఆయన కోసం వారి హృదయాంతరాళాల్లో నుండి పెల్లుబుకే భావోద్రేకాలు, పల్లం వైపునకు పారే నీటి చందంగా ఉండేవి. వారి హృదయాలు, వారి పంచప్రాణాలు ఆయన వైపునకు, ఇనుము సూదం టురాయి వైపునకు ఆకర్షింపబడినట్లుగా ఆకర్షించబడేవి.

ఆయన ఎడల సహాబా (ర)ల ఈ ప్రేమానురాగాలు, సమర్పణాభావం, ప్రాణాలనైనా అర్పించే త్యాగనిరతి ఫలితంగానే దైవప్రవక్త (స)కు కాలిలో ముల్లు గ్రుచ్చుకున్నా లేదా ఆయన కొనగోటికి దెబ్బతగిలినా వారు సహించే వారు కారు. అవసరమయితే తమ ప్రాణాలనయినా సమర్పించి ఆయన్ను రక్షించే ప్రయత్నం చేసేవారు.

ఓ రోజు అబూ బక్ర్ సిద్దీఖ్ (ర)ను చెప్పలేనంతగా చితకబాదడం జరిగింది. ఉత్బా బిన్ రబీయా ఆయన దగ్గరకు వచ్చి రెండు అతుకులు కలిగిన చెప్పులతో కొట్టనారంభించాడు. ప్రత్యేకంగా ముఖంపైనే కొడు తున్నాడు. వీపు పైకెక్కి కొట్టే దెబ్బలకు ముఖం ముక్కూ ఏదీ అగుపడడంలేదు. ఆ తరువాత ఆయన తెగ అయిన బనూ తైమ్ వారు ఆయన్ను గుడ్డలో చుట్టుకొని ఇంటికి గొనివచ్చారు. ఈ దెబ్బలకు బ్రతికి బట్టకడతాడనే ఆశ వారికి లేదు. అయితే ప్రొద్దుక్రుంకే సమయానికి ఆయన నోటి నుండి మాటలు వెలువడడం గమనించారు. నోటి నుండి మాట బయటకు రాగానే అబూ బక్ర్ (ర) చెప్పిన మాటలు, “దైవప్రవక్త (స) ఏమయ్యారు?” అన్నవే. ఆ మాటలకు బనీ తైమ్ తెగవారు ఆయన్ను తిట్టారు. తిడుతూ ఆయన తల్లి ఉమ్ముల్ ఖైర్‌నుద్దేశించి, ఈయనకు ఏదైనా తినిపించండి, త్రాగించండి అని చెప్పి వెళ్ళిపోయారు. వారు బయటకు వెళ్ళిన తరువాత ఉమ్ముల్ ఖైర్ ఒంటరిగా ఉండిపోయారు. ఏదైనా తినమని, త్రాగమని బలవంతపెట్టసాగారు. కాని అబూ బక్ర్ (ర) మాత్రం, “దైవప్రవక్త (స) ఏమైపోయారు” అనే అడుగుతున్నారు. చివరికి ఉమ్ముల్ ఖైర్ ఆయన్ను ఉద్దేశించి నీ మిత్రుని పరిస్థితి ఏమిటో నాకు తెలియదు అని అనగా నీవు వెళ్ళి ఉమ్మె జమీల్ బిన్తె ఖత్తాబ్‌ను అడిగిరా అని పంపించారు.

ఆమె వెళ్ళి,“అబూ బక్ర్, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ గురించి అడుగుతున్నాడు (నీకేమైనా అతని విషయం తెలుసా?)” అని అడిగారు.

“నాకు ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (స) గురించిగాని, నీ కుమారుడు

https://teluguislam.net



అబూ బక్ర్ గురించి గాని ఏమీ తెలియదు. కావలసి వస్తే నేను నీ వెంట నీ కుమారుని దగ్గరకు రాగలను" అన్నారు ఉమ్మె జమీల్.

"సరే, పద పోదాం" అని ఉమ్ముల్ ఖైర్, ఉమ్మె జమీల్‌ను తోడ్కొని అబూ బక్ర్ (ర) దగ్గరికి వచ్చారు. అబూ బక్ర్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. దగ్గరకు వచ్చి, "ఏ జాతి అయితే నిన్ను ఇలా కొట్టిందో ఆ జాతి తప్పకుండా దుష్టజాతి, దైవతిరస్కార జాతి. అల్లాహ్ నీ పరిస్థితికి పగతీర్చుకోకమానడు" అని అరిచారు.

"దైవప్రవక్త (స) ఏమయ్యారు?" అని అడిగారు అబూ బక్ర్.

"ఇది మీ అమ్మగారు వింటోంది" అని సంశయంగా అన్నారు ఉమ్మె జమీల్.

"ఫరావా లేదు చెప్పండి" అని అడిగారు ఆయన.

"క్షేమంగా ఉన్నారు."

"ఎక్కడున్నారు?" ప్రశ్నించారు అబూ బక్ర్.

"ఇబ్నె అర్ఖమ్ ఇంట్లో."

"అయితే, దైవప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళనంతమట్టుకు నేను ఏదీ తినేది లేదు, త్రాగేది లేదు. ఇది అల్లాహ్‌పై ఒట్టువేసి చెబుతున్నాను" అన్నారు అబూ బక్ర్ (ర).

ఉమ్ముల్ ఖైర్, ఉమ్మె జమీల్ అక్కడనే ఉండిపోయారు. రాకపోకలు సద్దుమణిగిపోయి బాగా చీకటి పడ్డ తరువాత వీరిద్దరు అబూ బక్ర్ (ర)ను తోడ్కొని బయలుదేరారు. అబూ బక్ర్ (ర)ను వారిద్దరు ఊతమిచ్చి మహాప్రవక్త (స) సన్నిధికి చేర్చగలిగారు.[5]

దైవప్రవక్త (స) గారి ఎడల సహాబా (ర)కున్న అనురాగం, ప్రాణత్యాగానికి సంబంధించిన అసాధారణ సంఘటనలు మేము ఈ గ్రంథంలో ముఖ్యంగా ఉహద్ యుద్ధంలో జరిగిన సంఘటనలు, హజ్రత్ ఖతీజా (ర) గారి విషయంలో చోటు చేసుకున్న విషయాలు సందర్భాన్నిబట్టి తెలియజేయగలం.

---

*5. అల్ బదాయా వన్నహాయా-3/30.*

https://teluguislam.net



## 3. బాధ్యతా భావన

మానవుడిగా చెప్పబడే ఈ పిడికెడు మట్టిముద్దపై ఎన్ని బృహత్తరమైన బాధ్యతలు ఉన్నాయో, ఆ బాధ్యతలను ఏ పరిస్థితుల్లోనూ విస్మరించడానికి వీలుండదో అనే యదార్థాన్ని మహాప్రవక్త (స) గారి అనుచరగణం బాగా ఎరిగిన వారు. ఎందుకంటే, బాధ్యతారాహిత్యం ఫలితంగా కలిగే దుష్పరిణామాలు ప్రస్తుత జులుం అత్యాచారాల కంటే భయంకరమైనవి, వినాశనకరమూ అయినవీను. ఆ బాధ్యతల్ని విస్మరించిన తరువాత ఖుద్దు వారికీ, సర్వమాన వాళికీ సంభవించే నష్టం ఎంత తీవ్రంగా ఉంటుందో, ప్రస్తుతం ఈ బాధ్యత లను నెత్తికేసుకోవడం వల్ల ఎదురయ్యే కడగండ్లు, నష్టాలు అంత పెద్దవేమీ కావు అనే సత్యం వారెరుగుదురు.

## 4. పరలోకమందు విశ్వాసం

ఈ పరలోక భావన, పైన చెప్పిన బాధ్యతకు బలం చేకూర్చే భావన. సృష్టికర్త, పోషకుడూ అయిన అల్లాహ్ ఎదుట ఓ రోజున నిలబడవలసి ఉంటుందని, చిన్నా పెద్ద మరియు సాధారణమయిన అన్ని రకాల కర్మలకు లెక్కచూపవలసి ఉంటుందనీ ఆ తరువాత అన్ని వరాలతో నిండి ఉన్న శాశ్వత స్వర్గమో లేదా యాతనలతో అట్టుడికిపోయే నరకమో ప్రాప్తమవుతుందనే అచంచల విశ్వాసం సహాబా హృదయాంతరాళాల్లో స్థిరపడిపోయి ఉంది. ఈ విశ్వాసం, ఈ నమ్మకం కారణంగానే సహాబా (ర) తమ జీవితాన్ని ఆశనిరాశల స్థితిలో గడిపేవారు. అంటే వారి పోషకుడు అయిన అల్లాహ్ కారుణ్యం ఎడల ఆశతోను, ఆయన శిక్ష ఎడల భయంతోనూ జీవించేవారు. వారి పరిస్థితి ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌లో వివరించినట్లుగా ఉండేది.

يُؤْتُونَ مَا آتَوا وَّقُلُوبُهُمْ وَجِلَةٌ أَنَّهُمْ إِلَىٰ رَبِّهِمْ رَاجِعُونَ ﴿٦٠﴾

**"వారు చేసే ప్రతి పనిని, హృదయాంతరాళంలో తమ పోషకుని వద్దకు తిరిగి పోవలసి ఉందనే భయంతో చేస్తారు." (23 : 60)**

ఈ ఇహలోకంలోని అన్ని రకాల హంగులు ఆర్భాటాలు, వరాలు, కష్టాలు కడగండ్లు అన్నీనూ, పరలోకంతో పోల్చినప్పుడు ఓ దోమ రెక్కంత విలువ కూడా చేయలేవనే యదార్థాన్ని వారు గట్టిగా నమ్మారు. ఈ విశ్వాసం, ఈ నమ్మకం ఎంత దృఢమైనదంటే, వారి దృష్టిలో ఈ లోకపు కష్టాలు, కడగండ్లు,

https://teluguislam.net



బాధలు అన్నిటికి ఎలాంటి ప్రాధాన్యత ఉండకపోయేది. అందుకనే వారు తమపై జరిగే అత్యాచారాలకు, హింసలకు ఎలాంటి విలువా ఇవ్వలేదు.

## 5. దివ్యఖుర్ఆన్ ఆయత్‌లు, సూరాల అవతరణ

ఈ కష్టతరమైన, ప్రమాదకరమైన మరియు అంధకారబంధురమైన పరిస్థితుల్లోనే, గట్టి ఆధారాలను జూపుతూ దివ్యఖుర్ఆన్ ఆయత్‌లు, సూరాలు అవతరించనారంభించాయి. అవి మనస్సును ఆకర్షించేవిగా ఉండి ఇస్లామీయ మౌలిక సూత్రాలను నెలకొలిపాయి. ఆ పరిస్థితుల్లో దైవ సందేశప్రచారం ఈ సూత్రాల చుట్టే పరిభ్రమిస్తూ ఉండేది. ఈ ఆయత్‌లలో ముస్లిములకు, అల్లాహ్ మానవాళికి సంబంధించిన మహోన్నతమైన, బృహత్తరమైన సమాజం అంటే ఇస్లామీయ సమాజ నిర్మాణానికి సంబంధించిన సూత్రాలను అవతరింప జేయడం జరిగింది. అదే కాదు, ఈ ఆయత్‌లలో ముస్లిముల భావోద్రేకాలను తట్టి వారిని స్థిరంగా నిలబడేందుకు పురికొల్పడం జరిగింది. దాని కోసం ఉదాహరణలు కూడా ఇవ్వడం జరిగింది. అందు దాగివున్న మర్మమేదో తెలుపడం జరిగింది.

أَمْ حَسِبْتُمْ أَن تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَأْتِكُم مَّثَلُ الَّذِينَ خَلَوْا مِن قَبْلِكُم ۖ مَّسَّتْهُمُ الْبَأْسَاءُ وَالضَّرَّاءُ وَزُلْزِلُوا حَتَّىٰ يَقُولَ الرَّسُولُ وَالَّذِينَ آمَنُوا مَعَهُ مَتَىٰ نَصْرُ اللَّهِ ۗ أَلَا إِنَّ نَصْرَ اللَّهِ قَرِيبٌ

"స్వర్గప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనేలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యథలు విరుచుకుపడ్డాయి. వారు కుదిపి వేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు, "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుందో" అని ఆక్రోశించారు. అప్పుడు, "అదిగో, అల్లాహ్ సహాయం సమీపం లోనే ఉంది" (అని వారిని ఓదార్చడం జరిగింది)" (2 : 214)

الٓمٓ ۝ أَحَسِبَ النَّاسُ أَن يُتْرَكُوا أَن يَقُولُوا آمَنَّا وَهُمْ لَا يُفْتَنُونَ ۝ وَلَقَدْ فَتَنَّا الَّذِينَ مِن

https://teluguislam.net



قَبْلِهِمْ فَلَيَعْلَمَنَّ اللَّهُ الَّذِينَ صَدَقُوا وَلَيَعْلَمَنَّ الْكَٰذِبِينَ ۝

"అలిఫ్. లామ్. మీమ్. కేవలం, "మేము విశ్వసించాము" అని అన్నంత మాత్రాన్నే, వారిని వదలివేయడం జరుగుతుందనీ, వారిని పరీక్షించడం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించాము. అల్లాహ్‌కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది." (29 : 1 - 3)

దైవతిరస్కారులకు, ఇస్లామ్ ధర్మం ఎడల విద్వేషాన్ని ప్రకటించే వారికి, వారి ఆగడాలను ఎత్తి చూపుతూ, సందర్భానుసారంగా ఇలాంటి ఆయత్‌లే అవతరింపనారంభించడంతో ఏమి చేయాలో తోచేది కాదు. ఈ ఆయత్‌లలో వీరే గనక ఆ మార్గభ్రష్టమైన విధానాన్ని మానుకోకపోతే దాని పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించడమూ జరిగింది. ఇలా అవతరిస్తున్న దైవా విష్కృతిలో గతించిన జాతులకు సంబంధించిన సంఘటనలు, చారిత్రక సత్యాలు విడమర్చి చెప్పడం జరిగింది. అదేకాదు, తనను నమ్మిన వారి విషయంలో, తన ఎడల శత్రుత్వం వహించే వారి విషయంలోనూ అల్లాహ్, ఏ తీరుగా ప్రవర్తించాడో వివరించి చెప్పడం కూడా జరిగింది. దీనికి తోడు, నిజాన్ని గ్రహించి తమ ప్రవర్తనను మార్చుకుంటే వారికి ఒనగూడే శ్రేయో సౌఖ్యాలు ఎలాగుంటాయో అన్నది కూడా తెలియజేయడం జరిగింది ఈ ఆయత్‌లలో.

యదార్థానికి, ఈ దైవావిష్కృతి (వహీ) ద్వారా అల్లాహ్ ముస్లిములకు మరో ప్రపంచంలోనికి తొంగి చూసే భాగ్యాన్ని కలిగించాడు. వారికి విశ్వ రహస్యాలను గురించిన అవగాహన కలిగిస్తూ తన దైవత్వపు అందచందాల్ని, తన ఏకత్వ మహాత్మ్యాన్ని, తన కారుణ్య చతురతను, తన ప్రసన్నతకు సంబం ధించిన సూచనలను చూపిస్తూపోతుంటే ఆ ఆకర్షణ ముందు మరే అడ్డంకి కూడా నిలువలేకపోయింది.

అదే కాదు, ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌ల భావాల వెనుక, ముస్లిములకు దైవం తరపున కారుణ్యం, ప్రసన్నతలు, వరాలతో నిండిన స్వర్గధామాల శుభ వార్తలు దాగి ఉన్న సంబోధనలు కనిపిస్తే, మరో ప్రక్క దైవధిక్కారులు, తలబిరుసుదనంగల దుష్టులకు, ఓ రోజున తాము దైవసన్నిధిలో నిలబడవలసి

https://teluguislam.net



ఉంటుందని, వారు ఆచరించిన సత్కర్మలు, పుణ్యఫలాలు అన్నీ నిష్ప్రయోజనమై వారిని బోర్లాపడవేసి నరకకూపంలో, అక్కడి శిక్షను అనుభవించడానికి పడవేయవలసి ఉంటుందనే హెచ్చరిక కూడా చేయడం జరిగింది.

## 6. విజయం శుభవార్త

అదంతా ఒక ఎత్తు. పోతే, ఇస్లాం ధర్మ స్వీకారం అంటే శాశ్వత కష్టాలను కొనితెచ్చుకోవడం కానేకాదని, ఆ సందేశ ప్రచారం మొదలైన నాటి నుండే అజ్ఞానాన్ని, అజ్ఞానుల్ని, వారి దమనకాండను అంతమొందించడమని ఇది ప్రారంభ దినం నుండే - ఇంకా చెప్పాలంటే, అంతకు పూర్వం నుండే - జరిగే కృషి అని ముస్లిములకు బాగా తెలిసిన విషయం. ఈ సందేశ ప్రచారానికి సంబంధించిన మరో కోణం, మరో లక్ష్యం ఏమిటంటే, ఈ భూమండలంలో తమ ప్రభావాన్ని విస్తరింపజేస్తూ, మానవాళిని, ప్రపంచ జాతుల్ని దైవాభీష్టం వైపునకు నడిచేటట్లుగా మానవాళిని మానవమాత్రుల దాస్య శృంఖలాల నుండి బయటకు లాగి, కేవలం అల్లాహ్ దాస్యాన్నే అవలంబించేటట్లుగా ప్రపంచ రాజకీయ వ్యవస్థపై ప్రాబల్యం సంపాదించడం.

దివ్యఖుర్ఆన్లో ఈ శుభవార్తలు - అప్పుడప్పుడు సూచనప్రాయంగా, మరొకప్పుడు వివరంగా, అవతరించబడేవి. ఓ వైపు, ముస్లిములపై ప్రపంచం అంతా, ఇక వారి మనుగడ ఏ మాత్రం సాధ్యంకాదన్నట్లు, వారిని తుడిచిపారేసేటట్లు కుంచించుకొని వస్తున్నట్లుగా అగుపించేది. కాని మరో ప్రక్క ఈ నిరుత్సాహ పరిచే పరిస్థితుల్లోనే, గత ప్రవక్తల చరిత్రల్ని వివరిస్తూ వారి అనుయాయుల్ని ఎలా తిరస్కరించడం జరిగిందో తెలిపే ఆయత్లు కూడా అవతరించనారంభించాయి. ఆ ఆయత్లలో, ప్రస్తుతం మక్కా ముస్లిములు, దైవ తిరస్కారుల నడుమ జరిగే సంఘర్షణల్లాంటివే జరిగాయని, దైవ మార్గాన్ని అవలంబించిన సత్పురుషుల్నే అల్లాహ్ భూమండలానికి వారసులుగాజేశాడని, అల్లాహ్ మార్గాన్ని తిరస్కరించిన తిరస్కారులను ముష్కరులను అల్లాహ్ నామరూపాల్లేకుండా చేసిన తీరును తెలిపే సూచనలు కానవస్తాయి. వీరు ముస్లిముల ఎడల ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటే మక్కావాసులు ఒకనాటికి నామరూపాల్లేకుండా పోతారని, ముస్లిములు, ముస్లిముల సందేశ ప్రచారం విజయం సాధిస్తుందనే శుభవార్త కూడా ఆ ఆయత్లలో ఉండేది. అదే కాదు,

https://teluguislam.net



ఈ పరిస్థితుల్లోనే, ముస్లిములు విజయం పొందుతారు అనే శుభవార్త వివరాలు గలిగిన ఖుర్‌ఆన్ ఆయత్‌లు అవతరించేవి. ఉదాహరణకు ఆ ఆయత్‌లు ఇలా ఉన్నాయి.

وَلَقَدْ سَبَقَتْ كَلِمَتُنَا لِعِبَادِنَا الْمُرْسَلِينَ ۝ إِنَّهُمْ لَهُمُ الْمَنصُورُونَ ۝ وَإِنَّ
جُندَنَا لَهُمُ الْغَالِبُونَ ۝ فَتَوَلَّ عَنْهُمْ حَتَّىٰ حِينٍ ۝ وَأَبْصِرْهُمْ فَسَوْفَ يُبْصِرُونَ ۝
أَفَبِعَذَابِنَا يَسْتَعْجِلُونَ ۝ فَإِذَا نَزَلَ بِسَاحَتِهِمْ فَسَاءَ صَبَاحُ الْمُنذَرِينَ ۝

"మేము పంపిన మా దాసులకు మేము ఇదివరకే వాగ్దానం చేసి ఉన్నాము, తప్పకుండా వారికి సహాయం చేయబడుతుందనీ, మన సైన్యమే ప్రాబల్యం వహించి తీరుతుందనీ. కనుక ఓ ప్రవక్తా! కొంతకాలం వరకు, వారిని వారి స్థితిలో వదలిపెట్టి చూస్తూ ఉండు. త్వరలోనే స్వయంగా వారు కూడా చూస్తారు. వారు మా శిక్ష రాక కోసం తొందరపెడుతున్నారు. ఆ శిక్ష వారి ఇంటి ప్రాంగణంలో దిగే రోజున హెచ్చరించబడిన వారికి అత్యంత కఠినంగా ఉంటుంది." (37:171 -177)

మరో చోట-

سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّونَ الدُّبُرَ ۝

"త్వరలోనే ఈ వర్గం పరాజయంపాలవుతుంది. వారంతా వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు." (54 : 45)

جُندٌ مَّا هُنَالِكَ مَهْزُومٌ مِّنَ الْأَحْزَابِ ۝

"ఇది బృందాలలోని ఒక చిన్న బృందం మాత్రమే. ఇదే స్థలంలో అది పరాజయంపాలు కానుంది." (38 : 11)

అబీసీనియాకు వలస వెళ్ళిన వారి గురించి ఇలా సెలవియ్యబడింది.

وَالَّذِينَ هَاجَرُوا فِي اللَّهِ مِن بَعْدِ مَا ظُلِمُوا لَنُبَوِّئَنَّهُمْ
فِي الدُّنْيَا حَسَنَةً ۖ وَلَأَجْرُ الْآخِرَةِ أَكْبَرُ ۚ لَوْ كَانُوا يَعْلَمُونَ ۝

"దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలసపోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమయితే ఇంతకంటే గొప్పగానే ఉంటుంది." (16 : 41)

https://teluguislam.net



ఇలాగే దైవ తిరస్కారులు దైవప్రవక్త (స)ను హజ్రత్ యూసుఫ్ (అ.స.) గారి గాధ ఏమిటో చెప్పమని అడగగా, సమాధానంగా ఈ ఆయత్ అవతరించింది.

لَقَدْ كَانَ فِي يُوسُفَ وَإِخْوَتِهِ آيَاتٌ لِّلسَّائِلِينَ ۝

"యదార్థానికి యూసుఫ్, అతని సోదరుల గాథలో ఈ అడిగే వారికి గొప్ప సూచనలు ఉన్నాయి." (12 : 7)

నేడు యూసుఫ్ (అ.స.) గాథను గురించి అడిగే ఈ మక్కావాసులు, యూసుఫ్ (అ.స.) సోదరులు అపజయం పాలైనట్లుగానే అపజయానికి గురికాగలరని, వీరి ఎత్తుగడలు కూడా యూసుఫ్ (అ.స.) గారి సోదరుల ఎత్తుగడలు విఫలమయినట్లే విఫలం కాగలవు అనీ, వీరు యూసుఫ్ (అ.స.) మరియు ఆయన సోదరుల గాథ ద్వారా గుణపాఠం నేర్చుకోవలసి ఉంది అనీ వివరిస్తూ, జులుము చేసేవారికి పట్టే గతి ఎలాగుంటుందో ఆ గాథలో విడమర్చి చెప్పడం జరిగింది. ఓ చోట ప్రవక్తల ప్రస్తావన తెస్తూ దివ్యగ్రంథం ఇలా సెలవిస్తోంది.

وَقَالَ الَّذِينَ كَفَرُوا لِرُسُلِهِمْ لَنُخْرِجَنَّكُم مِّنْ أَرْضِنَا أَوْ لَتَعُودُنَّ فِي مِلَّتِنَا ۖ فَأَوْحَىٰ إِلَيْهِمْ رَبُّهُمْ لَنُهْلِكَنَّ الظَّالِمِينَ ۝ وَلَنُسْكِنَنَّكُمُ الْأَرْضَ مِن بَعْدِهِمْ ۚ ذَٰلِكَ لِمَنْ خَافَ مَقَامِي وَخَافَ وَعِيدِ ۝

"చివరకు తిరస్కారులు తమ ప్రవక్తలతో ఇలా అన్నారు. 'మీరు మా మతంలోకి దిగిరావాలి. లేకపోతే మేము మిమ్మల్ని దేశం నుండి బహిష్కరిస్తాము.' అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా 'వహీ'ని పంపాడు. 'మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తరువాత మిమ్మల్ని భూమిపై వసింపజేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవలసి ఉందని భయపడుతూ నా శిక్షకు భయపడే వ్యక్తికే ఈ బహుమానం." (14 : 13,14)

ఇలాగే, పర్షియాలో యుద్ధజ్వాలలు చెలరేగే సమయంలో, దైవతిరస్కారులు పర్షియనులు నెగ్గాలని కోరుకునేవారు. ఎందుకంటే, పర్షియనులు బహుదైవారాధకులు. ముస్లిములేమో రోమనులు గెలువాలని కోరుకునేవారు. కారణం, రోమనులు ఓ విధంగా దైవప్రవక్తల్ని, దివ్యావిష్కృతిని, ఆకాశ

https://teluguislam.net



గ్రంథాలను, పరలోకాన్ని విశ్వసించేవారమని వాదించేవారు గనుక. కాని పర్షియనులే నెగ్గుకు వస్తూ విజయపరంపరలు సాధిస్తూ ఉన్న తరుణంలోనే అల్లాహ్ ముస్లిములకు, రోమనులే కొన్ని ఏండ్ల తరువాత విజయం సాధిస్తారు అని దివ్యఖుర్‌ఆన్‌లో శుభవార్త అవతరింపజేశాడు. కేవలం ఈ శుభవార్త అందించడం మట్టుకే సరిపెట్టలేదు. ఈ విషయంలో, రోమనులు విజయం పొందినప్పుడు ముస్లిములకు కూడా ప్రత్యేక సహాయం అందించి ఆదుకుంటాను. వారు సంబరపడాలి అనే శుభవార్త కూడా ఇవ్వడం జరిగింది. ఈ శుభవార్త ఇలా ఉంది:

وَيَوْمَئِذٍ يَفْرَحُ الْمُؤْمِنُونَ ۝ بِنَصْرِ اللَّهِ

"ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుకలు జరుపుకుంటారు." (30 : 4,5)

(భవిష్యత్తులో అల్లాహ్ అందించిన ఈ సహాయం బద్ర్ యుద్ధంలో లభించిన మహోన్నత విజయం రూపంలో అవతరించిన సహాయం.)

దివ్యఖుర్‌ఆన్ మట్టుకే కాదు, మహాప్రవక్త (స) స్వయంగా ముస్లిములకు సందర్భానుసారంగా ఇలాంటి శుభవార్తలనే వినిపించేవారు.

హజ్ కాలంలో ఉక్కాజ్, మజిన్నా, జుల్‌మజాజ్ సంతల్లో ప్రజలకు దైవదౌత్యం గురించి బోధించడానికి వెళ్ళినప్పుడు, స్వర్గం లభిస్తుందనే శుభవార్తను మాత్రమే అందించడం కాకుండా నిక్కచ్చిగా ఇలా ప్రకటించేవారు:

"ప్రజలారా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అనండి. సాఫల్యం పొందగలరు. ఫలితంగా మీరు అరేబియాకే రాజులైపోతారు. అరబ్బేతర రాజ్యాలు మీకు ఆధీనమైపోతాయి. (అదే కాదు!) మీరు మరణించిన తరువాత స్వర్గంలో మహారాజుల్లా నివసిస్తారు." [6]

ఉత్బా బిన్ రబీయా దైవప్రవక్త (స)ను లోబరుచుకోవడానికి ధన సంపదలను ఎరగా చూపి బేరసారాలు చేసినప్పుడు కూడా ఆయన (స) హామీమ్ అస్సజ్దా సూరాలోని ఆయత్‌లను పఠించి వినిపించినప్పుడు ఉత్బాకు, చిట్ట చివరకు ఆయనే విజయం సాధిస్తారనే నమ్మకం కుదిరిన విషయం ఇది వరకే చదువుకున్నాం.

6. తిర్మిజీ.

https://teluguislam.net



అలాగే అబూ తాలిబ్ వద్దకు వచ్చిన ఖురైష్ చివరి ప్రతినిధి బృందంతో దైవప్రవక్త (స) మాట్లాడిన మాటలు కూడా మనకు తెలిసినవే. ఈ సందర్భంలో ఆయన ఎంతో వివరంగా, ఒకే ఒక మాటను ఒప్పుకొమ్మని, దాన్ని ఒప్పుకుంటే అరేబియాకే చక్రవర్తులైపోతారని, అరబ్బేతర రాజ్యాలు వారికి అధీనం అయి పోతాయని చెప్పినట్లు మనకు గుర్తుంది.

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, "ఓసారి నేను దైవప్రవక్త (స) గారి సన్నిధికి చేరాను. ఆయన అప్పుడు కాబా గోడకు ఆనుకొని కూర్చుని ఉన్నారు. ఆ కాలంలోనే బహుదైవారాధకులు పెట్టే హింసలను భరించలేకపోతున్నాం మేము. నేను ప్రవక్త (స) ను, ప్రవక్తా! మనమెందుకు అల్లాహ్‌ను ప్రార్థించకూడదూ? అని అన్నాను. ఇది విన్నంతనే మహాప్రవక్త (స) దిగ్గున లేచి కూర్చున్నారు. ఆయన ముఖం (కోపంతో) ఎరుపెక్కింది. నన్ను చూసి, "నీకంటే ముందు గతించిన వారి ఎముకల నుండి మాంసం వేరుచేయ డానికి ఇనుప దువ్వెనలను పెట్టి దువ్వడం జరిగింది. ఈ హింస కూడా వారి ధర్మాన్ని వదిలేటట్లు చేయలేదు. అల్లాహ్ ఈ ధర్మాన్ని పరిపూర్ణం చేస్తాడు. చివరికి ఓ ప్రయాణీకుడు ఒంటరిగా సన్ఆ నుండి హజర్‌మౌత్ వరకు వెళ్ళ గలడు. అతనికి అల్లాహ్ భయం తప్ప మరెవ్వరి భయమూ ఉండదు. అయితే మేకకు మాత్రం తోడేలు భయం ఒకటే ఉంటుంది."[7]

మరో ఉల్లేఖనంలో, "అయితే మీరు తొందరపడుతున్నారు" అనే పదాలు కూడా ఉన్నాయి.[8] ఇవి అందరికీ తెలియని ఏవో శుభవార్తలు కావు. అందరికీ తెలిసిన, ప్రాచుర్యం పొందిన శుభవార్తలే. ముస్లిములకు మల్లే దైవతిరస్కారులు కూడా ఈ శుభవార్తలను గూర్చి బాగా ఎరుగుదురు. కాబట్టి అస్వద్ బిన్ ముత్తలిబ్, అతని మిత్రబృందం సహాబా (ర)ను చూడగానే ఎగతాళి చేస్తూ తమలో తాము, "చూశారా! మన దగ్గరికి భూలోక చక్రవర్తులు వస్తు న్నారు, వీరు త్వరలోనే పర్షియా, రోమను సామ్రాజ్యాలను జయిస్తారట" అని గేలిచేస్తూ చప్పట్లు చరిచేవారు, ఈలలు వేసేవారు.[9]

---

7. సహీ బుఖారి-1/543.
8. సహీ బుఖారి-1/510.
9. ఫికహుస్సీరత్-పుట. 84.

https://teluguislam.net



ఏదిఏమైనా, సహాబా (ర)లపై విరుచుకుపడే హింసాదౌర్జన్యాల ఈ తుఫాను, స్వర్గాన్ని పొందేవారి దృఢవిశ్వాసం, ఉజ్వల భవిష్యత్తు గురించిన శుభవార్తల ముందు పిల్లగాలికి తేలిపోయే ఓ పీచు మబ్బులాంటిదే.

ఇదే కాకుండా, మహాప్రవక్త (స), విశ్వసించిన వారి విశ్వాసానికి విశ్వాస మాధుర్యం ద్వారా సతతం ఆధ్యాత్మిక బలాన్ని చేకూర్చేవారు. గ్రంథ బోధనల ద్వారా వారి ఆత్మప్రక్షాళన జరుపడం జరిగేది. ఎంతో లోతయిన పటిష్ఠమైన శిక్షణ కూడా ఇచ్చేవారు. ఆత్మోన్నత్యం, హృదయ ప్రక్షాళన, నైతికతా నైర్మల్యం పొందడానికీ; భౌతిక పాశాల్లో చిక్కుకోకుండా, కామవాంఛలకు బలికాకుండా వారిని కాపాడుతూ, భూమ్యాకాశాల ప్రభువు వైపు మొగ్గుజూపేందుకు సతతం కృషి చేసేవారు. ఆయన (స) వారి హృదయాల్లో ఆరిపోబోతున్న అగ్గి రవ్వను, ప్రజ్వలించే అగ్ని కీలగా మార్చివేసేవారు. వారిని అంధకారం నుండి బయటకు తీసి సన్మార్గ వెలుగులో పయనింపజేశారు. హింసలను భరించమని ఉద్బోధ చేసేవారు. దానికి బదులు మన్నింపు ధోరణిని, సంయమనాన్ని పాటించమని హితబోధ చేసేవారు. దీని ఫలితంగానే వారి ధార్మిక దృఢత్వం రోజురోజుకు బలపడిపోసాగింది. కామవాంఛలకు దూరంగా ఉండే నిర్ణయం, దైవ ప్రసన్నతను పొందే కోరిక, స్వర్గాన్ని పొందే ఆకాంక్ష, జ్ఞాన సముపార్జనావేశము, ధర్మావగాహన, జవాబుదారీ తనం; ఉద్రేకాలను అణచివేసే ఆలోచనల్ని, సన్మార్గం వైపునకు మరల్చే శక్తి, మనస్సులో పెల్లుబుకుతున్న శంకల తరంగాలను నియంత్రించే సామర్థ్యం, శాంత స్వభావం మరియు గౌరవోన్న తుల్లాంటి సద్గుణ సంపదల్ని పొంది మానవీయ విలువల సాటిలేని మేటి సమాజంగా రూపొందారు ఆయన అనుచరగణం (రజిఅల్లాహు అన్హు).